

ఇంటర్వ్యూ

సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం

● సీహెచ్ మనోజ్‌కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి, జగిత్యాల



జగిత్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసి రైతుల సంక్షేమానికి కృషిని చేస్తున్నామని, ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎరువులు, విత్తనాలు రైతుల డిమాండ్ మేరకు సరాఫరా చేయడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా సహకారశాఖ అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్ అన్నారు. సహకారశాఖ పరంగా చేపడుతున్న కార్యక్రమాలు, రైతుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో సహకార వ్యవస్థ పరిస్థితి ఏమిటీ..?

జిల్లా సహకార అధికారి: జిల్లావ్యాప్తంగా 1,172 సహకార సంఘాలున్నాయి. వీటిలో 301 సహకార సంఘాలు తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964 కింద నమోదయ్యాయి. పరస్పర సహాయక సహకార సంఘాల చట్టం 1995 కింద 871 సంఘాలు నమోదు అయ్యాయి.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో సహకార సంఘాలు ఎలా పనిచేస్తున్నాయి..?

జిల్లా సహకార అధికారి: జిల్లా వ్యాప్తంగా 50 సంఘాలు కరీంనగర్ డీసీసీబీ పరిధిలో, ఒక సంఘం ఎస్‌బీఐ పరిధిలో పనిచేస్తోంది. జిల్లాలో అన్ని సంఘాలు ఎరువుల విక్రయం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ చేపడుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు 35,904 మంది రైతుల వద్ద నుంచి రూ. 446 కోట్ల విలువ గల 1,92,000 క్వింటాళ్ల ధాన్యాన్ని సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేశాము.

ఆంధ్రజ్యోతి: సహకార సంఘాల ద్వార ఎరువులు, విత్తనాల విక్రయం ఎలా సాగుతోంది..?

జిల్లా సహకార అధికారి: సహకార సంఘాల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించడానికి చర్యలు చేపడుతున్నాము. ఇటీవల జిల్లా కేంద్రంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్ని సహకార సంఘాల కార్యదర్శులతో అవగాహన సమావేశం, సమీక్ష నిర్వహించి దిశానిర్ధేశం చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్ సైతం రెండు రోజుల క్రితం సమీక్ష నిర్వహించారు.


ఆంధ్రజ్యోతి: యాసంగి సీజన్‌కు గానూ ఎరువులు, విత్తనాలు ఏ మేరకు విక్రయానికి అందుబాటులో ఉంచుతున్నారు..?

జిల్లా సహకార అధికారి: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సీజన్‌కు గానూ 5,870 మెట్రిక్ టన్నుల ఎరువులు, విత్తనాలు విక్రయానికి అందుబాటులో ఉంచుతున్నాము. ఇందులో కాంప్లెక్స్ 95వేల మెట్రిక్ టన్నులు, యూరియా 3,530 వేల మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 1,065 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,275 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచుతున్నాము. జిల్లాకు ఒకటి, రెండు రోజుల్లో డీఏపీ, ఇతర ఎరువులు వస్తున్నాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి: సహకార రంగానికి ఇఫ్కో తోడ్పాటు ఎలా ఉంది..?

జిల్లా సహకార అధికారి: జిల్లాలోని ఏడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు వ్యవసాయ డ్రోన్లను ఇఫ్కో అందజేసింది. ఇందుకు సంబంధించిన శిక్షణను సైతం ఇఫ్కో అందించింది. పంటలలో ద్రవరూప యూరియా, కీటక నాశనీలను ఈ డ్రోన్లు పిచికారి చేస్తాయి. ప్రైవేటు రంగంలో డ్రోన్ల వాడకానికి అయ్యే వ్యయంలో సహకార సంఘాలు వసూలు చేసే వ్యయం మూడోవంతు ఉంటుంది. తెలంగాణ జిల్లాల్లో కేవలం జగిత్యాల జిల్లాలోనే డ్రోన్లను ఇఫ్కో అందించింది.

సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు



- చిప్‌తో స్మార్ట్ రేషన్ కార్డు
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ ప్రకటనతో ఆశలు
- జిల్లాలో 40 వేలకు పైగా కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి



జగిత్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఈ సంక్రాంతికి కార్డులు జారీ చేస్తామని అసెంబ్లీలో ప్రకటించగా... దరఖాస్తుదారుల సుమారు ఆరున్నరేళ్ల నిరీక్షణకు మోక్షం కలగనుంది. గతంలో వేసిన కేబినెట్ సబ్ కమిటీ సూచనలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సలహాల మేరకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు రావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలు తెల్లరేషన్ కార్డుతో లింకు పెడుతున్నాయి. ఆరున్నరేళ్లుగా కొత్త కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడం, ఉన్నా పిల్లల పేర్లు నమోదు చేసే అవకాశం లేక అనేక కుటుంబాలు వీటికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రానున్న సంక్రాంతి లోపు కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

● జిల్లాలో 3,10,545 కార్డులు..

జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 587 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీ నెల పేదలకు ఉచిత బియ్యం, రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. జిల్లాలో మొత్తం 3,10,545 రేషన్ కార్డులుండగా ఇందులో 2,95,916 ఆహార భద్రతా కార్డులు, 14,483 అంత్యోదయ కార్డులు, 146 అన్నపూర్ణ కార్డులున్నాయి. ప్రతీనెల సుమారు 9,369 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సుమారు 9,04,521 మందికి పౌరసరాఫరా శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో కొన్ని సంవత్స రాలుగా పేదలు చేసుకున్న రేషన్ కార్డుల దరఖాస్తులు సుమారు 40 వేలకు పైగా ఉన్నట్లు ఓ అంచనా ఉంది.

● ఆరున్నరేళ్లుగా నిరీక్షణ...

గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో 2019 జూన్30న తెల్ల రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిపివేసింది. 2020 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా కొంత మందికి ఇచ్చినట్టే ఇచ్చి ఫ్రీజింగ్ విధించింది. దీంతో నాటి నుంచి నేటి వరకు కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు, ఉమ్మడి కుటుంబం నుంచి విడిగా ఉన్నవారు కొత్త రేషన్ కార్డుకోసం ఎదురు చూస్తున్నారు. కాగా వీరిలో అప్పటికే తెల్లరేషన్ కార్డులు ఉన్నప్పటికీ... పిల్లలు పుట్టిన తర్వాత వారిని యాడ్ చేయడం, ఆధార్, అడ్రస్, ఫోన్‌నంబర్లు సరి చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మ్యుటేషన్, మెంబర్ అడిషన్ కొత్త కార్డులకోసం కొన్ని సంవత్స రాలుగా వేల సంఖ్యలో దరఖాస్తులను అధికారులకు అందించారు. ఇందులో కొత్త కార్డులు, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులను చేర్చాలని (మెంబర్ అడిషన్) కోరుతూ సుమారు 20వేల వరకు దరఖాస్తులున్నట్లు అంచనా ఉంది.

● స్మార్టు కార్డుల రూపంలో...

రేషన్ కార్డులను స్మార్టు కార్డుల రూపంలో జారీ చేయాలని సర్కారు నిర్ణయించింది.

మిగతా 8లో

న్యూస్ బాక్స్

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలుర కిక్‌బాక్సింగ్ పోటీల్లో పట్టణంలోని ఓల్డ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అభిలాష్ గోల్డ్ మెడల్ సాధించి ప్రథమ స్థానంల నిలిచినట్లు పీడీ రాధిక తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో అభిలాష్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు. మరింతగా క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామానుజం, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

వెల్గటూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంగళవారం పంపిణీ చేశారు. ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని 111 మంది లబ్ధిదారులకు రూ.30 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



కోరుట్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, నాయకులు

8

బస్సు సౌకర్యం లేక మోడల్ స్కూల్ విద్యార్థుల ఇబ్బందులు

- రెండు కిలోమీటర్లు నడిచి వెళ్తున్న విద్యార్థులు
- మైదానంలో బండరాళ్లు



మోడల్ స్కూల్ మైదానంలో ఉన్న రాళ్లు

7

అంజన్న సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో ఆండాల్ అమ్మవారు


మల్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆండాల్ అమ్మవారికి, గోదారంగనాథులకు మంగళవారం ప్రత్యేక పూజలు, సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణరావు, స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేందర్, రఘు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహర నాథ్, సునీల్, చంద్రశేఖర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● భక్తుల సందడి..

మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో అంజన్న సన్నిదానం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు.

'పది' పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాధికారి కె రాము



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖధికారి రాములు

కోరుట్ల/మెట్‌పల్లి టౌన్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో ఉన్నత ఫలితాలను సాధించి వంద శాతం ఉత్తీర్ణత పొందాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో, మెట్‌పల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పాఠశాల కాంప్లెక్స్ స్థాయి మీటింగ్‌ను జిల్లా విద్యాధికారి రాము సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల హాజరు శాతంను పరిశీలించి విద్యాబోధనపై వివరించారు. ప్రతి విద్యార్థి ఇంగ్లీష్‌లో రాణించే విధంగా విద్యాబోధన అందించాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించి పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత చెందే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపి విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అడ్డగట్ల శ్రీనివాస్, కనకతార, మండల విద్యాధికారులు నరేశం, మేకల చంద్రశేఖర్, సెక్టోరియల్ అధికారి రాజేశం, రిసోర్స్ పర్సన్లు పాటిల్ ధరమ్ దీప్, శివప్రసాద్, మహేష్, దామెదర్, రణదీర్, హరినాథ్, నర్సింగరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రాయికల్(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన ఫలితాల సాధనతో పాటు స్పష్టంగా రాయడం, చదవడంవంటి నైపుణ్యాలు, అభివృద్ధి చేయాలని పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయుడు మామిడాల శ్రీనివాస్ అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయికల్, మేడిపల్లి, భీమారం మండలాలకు చెందిన ఉన్నత పాఠశాలల తెలుగు బోధకు ల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌పీలు చెరుకు మహేశ్వర శర్మ, డాక్టర్ మోతుకుల నారాయణగౌడ్, హెచ్‌ఎంలు, పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

జగిత్యాల అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువైంది. మంగళవారం కావడంతో అనేక మంది భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా సుబ్రహ్మణ్య స్వామి వారికి అభిషేకాలు నిర్వహించడం ద్వారా తాము కోరిన కోర్కెలు తీరడంతో పాటు సంతానం అభివృద్ధి చెందుతుందని ఆలయ అర్చకులు గోసంగారి సురేష్ తెలిపారు.

ప్రసూతి, వైద్య సేవలను మెరుగుపరచాలి





రాయికల్‌లో ఓపీ వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్, సాతారంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి, వైద్యసేవలను మెరుగుపరచాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. రాయికల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజుకు ఎన్ని ఓపీలను చూస్తున్నారు, ఎంత మంది డెలివరీలు అయ్యారని అడిగారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీలను పెంచేందుకు గర్భిణులను ప్రోత్సహించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన ఆహారం, తాగునీటిని అందించాలన్నారు. శుభ్రమైన తాగునీటిని సరఫరా చేసే విధంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రోగులను కలిసి వారి ఆరోగ్య వివరాలను, సిబ్బంది వ్యవహరించే తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి భవనానికి రంగులు, మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ జంగిలి శశికాంత్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా జరపాలి

మల్లాపూర్ (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా సర్వే జరపాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని సాతారాం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి, సర్వే చేస్తున్న తీరును ఆయన తనిఖీ చేశారు. దరఖాస్తుదారులతో మాట్లాడి ఏమైనా ప్లాట్లు ఉన్నాయా, ఇంటి నిర్మాణం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. అధికారులు సర్వే చేస్తున్న పత్రాలు, మొబైల్ యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ఆధారంగా లబ్ధిదారుల వివరాలను పరిశీలించిన తరువాతనే అర్హులైన వారి ఫొటోలు, వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామాల్లో సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ రాజేశ్వర్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● పశు సంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ మరియు వెటర్నరీ వైద్యులతో కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జిల్లాలో చేపడుతున్న ప్రతీ అంశంపై ఆయన కూలంకశంగా చర్చించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక చేపడుతున్న 21వ అఖిల భారత పశుగణనలో సిబ్బంది గడపగడపనా సందర్శించి రైతుల వివరాలు, పశువుల వివరాలు పూర్తిగా యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిలా పశు సంవర్ధక శాఖ అధికారులు ఎస్ఎల్ మనోహర్, బోనగిరి నరేష్ పాల్గొన్నారు.

చలిపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

మల్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోందని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ ప్రత్యేక అధికారి డాక్టర్ అర్చన పేర్కొన్నారు. మండలంలోని ముత్యంపేటలో మంగళవారం వాతవరణ మార్పులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ రెండు రోజులుగా పగటి పూట చలి విపరీతంగా పెరుగుతోందని ప్రజలు జాగ్రతగా ఉండాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం 10గంటల వరకు తలకు, చెవులకు చలి తగలకుండా మంకీ క్యాపులు, స్వెట్టర్లు ధరించాలని అన్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్, ద్విచక్రవాహనాలపై

పెన్షనర్లను అందరూ గౌరవించాలి



పెన్షనర్లను సన్మానిస్తున్న డీటీవో సోఫియా

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలం సేవలు అందించి పదవీ విరమణ పొందిన పెన్షనర్లపై అందరూ గౌరవ భావంతో మెలగాలని జిల్లా ట్రెజరీ అధికారి సీహెచ్ సోఫియా అన్నారు. మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పెన్షనర్ల పితామహుడు నకారా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం జిల్లాలోని 86 మంది విశిష్ట పెన్షనర్ల ను పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ రాజ్‌కుమార్, సఖి అడ్మిన్ లావణ్య, ఏటీవో మధుకుమార్, ఎస్టీవో గణేష్, హన్మంత్‌రెడ్డి, విశ్వనాథం, వి ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మైన్స్, రవాణా శాఖ అధికారుల తనిఖీలు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక మోతె బైపాస్ రోడ్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మైన్స్, రవాణా శాఖ అధికారులతో కలిసి జిల్లా భూగర్భ గనుల జిల్లా ఏడీ జైన్‌సింగ్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఓ ఇసుక లారీకి 3,250 రపాయల అపరాధ రుసుమును విధించినట్లు ఏడీ జైన్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు ఉన్న క్వారీలు అన్నీ తగిన అనుమతులతోనే క్వారియింగ్ చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎంవీఐ తిరుపతిరావు, కానిస్టేబుల్ బాలు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగు, అయోధ్య గ్రామాల్లో 33 కేవీ లైన్ పనులు జరుగుతున్న దృష్ట్యా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ హరీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని పాఠశాలల మధ్యాహ్న బోజన కార్మికులు జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రెండో రోజు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు వంటావార్పు చేశారు. కార్మికులు ధర్నా చేసున్న ప్రదేశానికి విద్యాశాఖ కో- ఆర్డినేటర్ చేరుకుని వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న బోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలారాజు, సీఐటీయూ జిల్లా నాయకురాలు సులోచన తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుటామని మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో స్కానింగ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఫాం ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించాలని 5వ తేదీలోపు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎన్‌డీటీ టీం సభ్యులు భూమేశ్వర్, రాజేశం, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ కార్పోరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకంలో బాగంగా మైనార్టీ మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి కుట్టు మిషన్ స్కీం కింద ఉచిత కుట్టు మిషను శిక్షణకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ అధికారి ఆర్ఎస్ చిత్రు తెలిపారు.18-55 ఏళ్లలోపు వయస్సు కలిగిన ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉండి, ఐదవ తరగతి కనీస విద్యార్హత కలిగి ఆధార్‌కార్డుతో పాటు సెల్ఫ్ డిక్లరేషన్ సర్టిఫికెట్ అర్హతలు కలిగి ఉన్న నిరుద్యోగ మైనార్టీ మహిళలు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన మహిళలు ఈ నెల 31తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

గంగాధర, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురానగర్‌కు చెందిన బట్టల వ్యాపారి ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మధురానగర్‌కు చెందిన ఇప్పలపెల్లి మల్లేశం(53) గ్రామాల్లో బట్టలు విక్రయిస్తుండేవాడు. వ్యాపారం సరిగా నడువక అప్పులు పెరిగాయి. మంగళవారం ఉదయం గంగాధర రైల్వే లైనుపై మల్లేశంను రైలు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు.భార్య శంకరవ్వ ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

● ఏడుగురి పట్టివేత ● రూ.10,480, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం

సుల్తానాబాద్, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి శివారు ప్రాంతంలో రహస్య పేకాట శిబిరంపై రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకున్నామని, వారి నుంచి పది వేల నాలుగు వందల ఎనభై రూపాయల నగదు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వీరిని తదుపరి విచారణ నిమిత్తం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వారు వివరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పంజాల చంద్రయ్య అనే గీత కార్మికుడు వృత్తిలో భాగంగా మంగళవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ఈనెల 12న ఓ దుకాణం ఎదుట ఉంచిన దాసరి అజయ్‌కుమార్‌కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైందని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పెరుగుపల్లికి చెందిన అజయకుమార్ ఎల్లారెడ్డిపేటకు వలస వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా కొనసాగుతున్నట్లు తెలిపారు.

మూగబోతున్న స్వరాలు





సాధన చేస్తున్న విద్యార్థి

వినియోగం లేక మూలన పడ్డ వీణలు

సంగీత కళాశాలలో సమస్యల తిష్ట

రెండున్నర దశాబ్దాలుగా లెక్చరర్ల పోస్టులు ఖాళీ

అరకొరగా వసతులు.. నామమాత్రంగా ప్రవేశాలు

మంథని ప్రభుత్వ సంగీత కళాశాల దుస్థితి

మంథని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆసక్తి, అభిలాష కలిగిన యువతను సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దాల్సిన మంథని సంగీత కళాశాలలో సమస్యలు తిష్ట వేశాయి.. సంగీతాన్ని బోధించే గురువులు లేక వాయిద్యాలన్నీ దశాబ్దాలుగా గదుల్లోనే బంధీలవుతున్నాయి. మంథనిలోని సంగీత కళాశాల నిర్వహణకు ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడం లేదు. గత ప్రభుత్వాలు, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం సప్తస్వరాలతో కళకళలాడాల్సిన మంథని సంగీత కళాశాల కళావిహీనంగా దర్శనమిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న ఏకైక ప్రభుత్వ సంగీత కళాశాల నిర్వాహణను రెండున్నర దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. హైదరాబాద్‌లో మూడు, వరంగల్, నిజామాబాద్, మంథనిలో ఒక్కొటి చొప్పున తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఆరు మాత్రమే ప్రభుత్వ సంగీత కళాశాలున్నాయి.



సాధన చేస్తున్న విద్యార్థులు

గతమెంతో ఘనం..

వేద విద్యకు నిలయమైన మంథనిలో మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు ప్రత్యేక చొరవతో 1992లో ప్రభుత్వ సంగీత కళాశాలను మంజూరుచేయించి స్వయంగా ప్రారంభించారు. కళాశాలలో హిందూస్థానీ, కర్నాటక ఓకల్, సితార, వీణా, వాయిలిన్, మృదంగం, కూచిపూడి విభాగాల్లో కోర్సులను ప్రారంభించారు. ఆయా విభాగాల్లో కోర్సు బోధించడానికి లెక్చరర్లతో పాటు మృదంగం, తబలా, గామక్ విభాగాల్లో మరో సహాయక పోస్టులను మంజూరు చేశారు. రెండు సంవత్సరాల పాటు అన్ని విభాగాల్లో కలిపి దాదాపు 500 మంది అభ్యర్థులు కళాశాలలో విద్యార్థులుగా చేరి సంగీత సాధన ప్రారంభించారు. అయితే మంథని పట్టణ ప్రాంతం కాకపోవడంతో ప్రైవేట్ క్లాసుల ఇన్‌కం లేక సంగీత కళాశాలలో పని చేస్తున్న చాలా మంది లెక్చరర్లు 1994 తర్వాత పైరవీలతో డిప్యూటేషన్‌పై వెళ్లి ఆ తర్వాత బదిలీ చేయించుకున్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సైతం డిప్యూటేషన్‌పై వెళ్లి పోయారు.

కర్ణాటక ఓకల్, మృదంగం, పేరిణి విభాగాల్లో సాధన..

సంగీత కళాశాలలో ప్రస్తుతం కర్ణాటక గాత్రం, మృదంగం, పేరిణి విభాగాల్లో మాత్రమే క్లాసులు జరుగుతున్నాయి. ఇటీవల ప్రిన్సిపాల్‌గా నియమితులైన శారద కర్ణాటక ఓకల్ విభాగాన్ని ప్రారంభించారు. సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల్లో ఐదుగురి వరకు బోధిస్తూ సాధన చేయిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతి పైన ఇదే కళాశాల పూర్వ విద్యార్థి జంబోజు రాజేశం మృదంగం విభాగాన్ని దాదాపు 10మంది విద్యార్థులకు బోధిస్తూ సాధన చేయిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతి పైన పేరిణి నృత్యాన్ని కుమార్ 8 మంది విద్యార్థులకు సాధన చేయిస్తున్నారు. అయితే సంగీత కళాశాలలో లెక్చరర్లు లేని కారణంగా అనేక కోర్సులు అందుబాటులో లేకుండా పోయాయి. హిందూస్థానీ ఓకల్, సితార, వీణా, వాయిలిన్, కూచిపూడి విభాగాల్లో కోర్సుల్లో సాధన పూర్తిగా కనుమరుగైపోయింది.

● సొంత భవనం కరువు..

మంథనిలో ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రారంభమై దాదాపు 30 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి సొంత భవనం లేదు. నాటి నుంచి నేటి వరకు అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయించి సంగీత కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని సంగీతాభిమానులు కోరుతున్నారు.



పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి..

శారద, ప్రిన్సిపాల్, సంగీత కళాశాల, మంథని.



మంథని ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేస్తాను. ఇటీవలనే ప్రిన్సిపాల్‌గా చార్జి తీసుకున్నాను. త్వరలోనే మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, సంస్థ డైరెక్టర్‌లను కలిసి కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచటానికి కూచిపూడి నృత్యం, తబలా, వయోలిన్, వీణ లాంటి కోర్సులు బోధించడానికి లెక్చరర్ల పోస్టులు మంజూరు చేయాలని, సొంత భవనం నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తాను. అందరి సహకారంతో కళాశాలను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తాను.

కళాశాల మూతపడవద్దనే పని చేస్తున్నా..

తాత్కాలిక మృదంగం అధ్యాపకుడు రాజేశం



మంథనిలో సంగీత కళాశాల మూతపడవద్దనే తాత్కాలికంగా మృదంగం అధ్యాపకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు మృదంగం నేర్పిస్తున్నాను. ఇదే కళాశాలలో నేను మృదంగంలో డిగ్రీ కోర్సు పూర్తి చేశాను. మళ్లీ ఇక్కడే విద్యార్థులకు 15 ఏళ్ళుగా మృదంగం నేర్పిస్తున్నందుకు ఆనందంగా ఉంది. కళాశాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకురావటానికి నావంతు సహకారం అందిస్తా.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఎండపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మండలంలోని సూరారం గ్రామంలో ఏపీ 29 బీఎస్ 4853 నెంబర్ గల కారు బసంత్‌నగర్ నుంచి రాజారాంపల్లి వైపు వస్తున్నది. అదే క్రమంలో కారు ముందు ద్విచక్రవాహనంపై సబ్బులు అమ్ముకునే గుర్తుతెలియని యువకుడు మారేడుపల్లి నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాన్ని వెనకనుంచి కారు ఢీకొట్టంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన నీలం అనిల్, అతని భార్య, ఇద్దరు పిల్లలు కారులో ఉన్నారు. పాప చెవికి కూడా గాయమైంది. గాయపడిన గుర్తుతెలియని యువకుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఇద్దరి మృతికి కారణమైన కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన సింగరవేణి కిషన్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు 18నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. 12 జనవరి 2014న కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన గడిపల్లి మల్లేశం, తాటకర్ల శంకర్‌పైకి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపడంతో ఇద్దరూ మృతిచెందారు. ఈ సంఘటనపై అప్పటి ఎస్సై మాలకొండరాయుడు కిషన్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న టుటౌన్ సీఐ ప్రమోద్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని రెండు నెలలుగా మోసాలకు పాల్పడుతున్న అల్లూరు రాజీవ్‌నగర్ తండాకు చెందిన ధరావత్ రాజేష్ నాయక్‌ను అరెస్టు చేసినట్లు గోదావరిఖని టుటౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజేష్ నాయక్ అరెస్టు వివరాలను సీఐ ప్రమోద్‌రావు వెల్లడించారు. అన్నపూర్ణ ఫుడ్స్ కంపెనీలో నెలకు పదివేల రూపాయల జీతం వస్తుందని ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2600 నుంచి రూ.5200వసూలు చేస్తూ, స్థానిక సదానందం థియేటర్‌ను లీజుకు తీసుకొని అమాయక ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరపగా రాజేష్ నాయక్ బీజేపీ పేరు చెప్పి ప్రభుత్వ స్కీములను ఇప్పిస్తానని ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తించినట్లు సీఐ పేర్కొన్నారు.

భార్యను వేధించిన కేసులో 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన కేసులో గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్‌కు చెందిన షేక్ నవాజ్‌కు 18నెలల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన ఆఫ్రిన్‌ను ఆమె భర్త నవాజ్, బంధువులు అదనపు కట్నం తీసుకురావాలని వేధించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుడికి 18నెలల జైలు శిక్ష, రూ. 3వేల జరిమానా విధించారు.

హాస్టల్ నుంచి పారిపోయిన బాలుడు

● గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన నాంపల్లి శ్రీరామన్ (17) అనే బాలుడు పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్ గేటు దూకి పారిపోయాడు. పోలీసులు పది గంటల్లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి శ్రీరామన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున హాస్టల్ గేట్ దూకి పారిపోయినట్లు పాఠశాల యాజమాన్యం గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలుడి తండ్రి నాంపల్లి లక్ష్మీనర్సయ్య వెంటనే మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి బాలుడి మిస్సింగ్ కేసు నమోదు చేసి మెట్‌పల్లి ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీఐ ఆదేశాలతో పోలీస్‌లు రెండు బృందలుగా ఏర్పడి ఒక బృందం జగిత్యాల వైపు, మరో బృందం నిజామాబాద్ వైపు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడు హాస్టల్ వార్డెన్ ఫోన్‌ను తీసుకెళ్లడంతో సీడీఆర్ టెక్నాలజీని ఉపయోగించి పారిపోయిన బాలుడు పెద్దపల్లి జిల్లా కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్టు గుర్తించి వెంటనే పోత్కపల్లి పోలీస్‌స్టేషన్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్‌కు సమాచారం అందించి బాలుడిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అబ్బాయి శ్రీరామన్‌ను పది గంటల్లోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు అభినందించారు.

ముమ్మరంగా సూరమ్మ మత్తడి నిర్మాణ పనులు

కథలాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోట సూరమ్మ చెరువు మత్తడి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-2, ఫేజ్-1లో భాగంగా సుమారు ఆరు కోట్ల రూపాయల అంచనాతో పనులు చేపడుతున్నారు. బీవీఆర్ఎస్ఎల్ కంపెనీ సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా మత్తడి, కొత్త తూము నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌తో వేగవంతంగా పనులను చేపడుతున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులతో చర్చలు కొనసాగిస్తున్నారని తెలిసింది. .

బద్దిపోచమ్మకు బోనం మొక్కులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిల్లపాపలను, పాడిపంటలను చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండి డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్ కిక్కిరిసిపోయింది. భక్తులు నెత్తిన బోనంతో సుమారుగా రెండు గంటలపాటు నిరీక్షించారు. ఆలయంలోకి వెళ్లిన భక్తులు ముందగా అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇన్‌చార్జి శివసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లా విద్యాశాఖాధికారిపై ఆర్జేడీ విచారణ



డీఈవో కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారిపై డీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి డీఈవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో జరిగిన అవతవకలపై డీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు వి.రాజిరెడ్డి, ఆవాల నరహరి, తూముల తిరుపతి, పి దామోదర్‌రెడ్డి, జె రామచంద్రారెడ్డి, వి బాలయ్యలు ఆర్‌జేడీకి వివరించారు. డీఈవో పుట్టిన తేదీపై, బీఈడీ అర్హతలపై గతంలో వచ్చిన అభియోగాలు, అనవసరపు ఫార్మాట్లు రూపొందించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పని భారాన్ని పెంచుతున్నారని ఆర్జేడీకి వివరించినట్లు తెలిసింది. పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో వివిధ సబెక్టుల్లో జరిగిన అవకతవకలను ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. 317 జీవో అమలులో జరిగిన అవకతవకలను, కొంత మంది ప్రధానోపాధ్యాయులను తరచుగా ఆన్‌డ్యూటీ పేరిట డీఈవో కార్యాలయానికి రప్పిస్తున్నారంటూ డీఈవోపై ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. డీఈవో కార్యాలయంలో లెక్కకు మించి నాన్ టీచింగ్ స్టాఫ్‌ను వివిధ పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై నియమించడంపై ఫిర్యాదు చేశామన్నారు. డీఈవో ఏ రోజు కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని, దీనితో ఫైల్స్ క్లియర్ చేయడంలో జాప్యమవుతోందని సంఘ నాయకులు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బంగారం కడిగి ఇస్తామని అపహరణ



నకిలీ పుస్తెల తాడు



బాధితురాలు నక్క జమున

కోరుట్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాత్రలకు పూతలు వేసి.. బంగారం కడిగి ఇస్తామని మహిళను మోసం చేసి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన మండలంలోని నాగులపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పాత్రలకు పూతలు పెట్టి, బంగారం కడిగి ఇస్తామంటూ గ్రామంలో సంచరిస్తూ గ్రామ పంచాయతీ సమీపంలోని బాధితురాలు నక్క జమున ఇంటికి వెళ్లారు. జమునతో ఇంట్లోని బోళ్లను పూత పెడుతామని.. బంగారం కడిగి ఇస్తామని తెలపడంతో ఇంట్లో ఉన్న బోళ్లను బాధితురాలు గుర్తు తెలియని వ్యక్తులకు అందించింది. దీంతో వారు బోళ్లను శుభ్రం చేస్తూ తన మెడలో ఉన్న బంగారం కడిగి ఇస్తామని నమ్మించారు. వెంటనే ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడుతో పాటు మరో బంగారు ఆభరణాన్ని గుర్తుతెలియని వ్యక్తులకు అందించింది. దీంతో వారు బంగారం శుభ్రం చేశామని నకిలీ ఆభరణాన్ని జమునకు అందించి ఇంట్లో ఉన్న పసుపులో పెట్టుకొని అరగంట తరువాత తీసుకోవాలని సూచించి అక్కడి నుంచి వారు జారుకున్నారు. అరగంట అయిన తర్వాత పసుపులో పెట్టిన బంగారం చూడగా అది బంగారం కాదని తెలుసుకుని లబోదిబోమంది. చుట్టు పక్కల వారికి విషయం తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితురాలు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుర్రాల అకాష్

ధర్మారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర విశ్వవిద్యాలయాల స్థాయి వాలీబాల్ పోటీలకు ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన గుర్రాల ఆకాష్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తమ్మనవేణి కుమార్ తెలిపారు. ఈనెల 18 నుంచి 22వరకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో శాతవాహన యూనివర్సిటీ తరపున ఆకాష్ ఆడనున్నారు. ఆకాష్ వివేకనంద డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆకాష్‌ను ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, వైస్ చైర్మన్ లింగయ్య, పాక్స్ వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లు, మాజీ సర్పంచ్ జానకీ శంకర్, తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ కోకో పోటీలకు ఎంపికైన విద్యార్థిని



విద్యార్థిని సంధ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మనగర్ గ్రామం ఎల్ఎండి కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కే. సంధ్య రాష్ట్ర స్థాయి సీఎం కప్‌లో కోకో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా స్థాయి కోకోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సంధ్యను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పిడి.బన్సిలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పంప్‌హౌస్ ప్రాంతంలో పులి సంచార వదంతులు

మల్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాంపూర్ శివారులో పులులు సంచరించించాయనే వదంతులు ఈ ప్రాంతవాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇక్కడికి సమీపంలో రాంపూర్, ఓబులాపూర్, గొర్రెగుండం అటవీ ప్రాంతం ఉండడం, మేడిపల్లి మండలం కాసారం వరకు అడవి విస్తరించి ఉంది. కొన్నాళ్ల క్రితం కాసారం వైపు వెళ్లే మార్గంలో గల గుట్టల్లో పులి కనిపించిదని వదంతులు వ్యాపించాయి. తాజాగా మంగళవారం వేకువజామున రాంపూర్ పంప్‌హౌస్ సమీపంలో మూడు పెద్ద పులులు కనిపించాయని కొందరు సోషల్‌మీడియాలో వదంతులు వ్యాపింపచేశారని రాంపూర్‌వాసులు తెలిపారు. ఈ విషయమై గ్రామస్థులు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొన్నిరోజులుగా సోషల్‌మీడియాలో పులులు సంచార వదంతులతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బీట్ అధికారి వసీంను సంప్రదించగా పులి సంచార వదంతులను ప్రజలు వాటిని నమ్మవద్దని సూచించారు.

గంజాయి మొక్కలు పట్టివేత

ముత్తారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఓ వ్యక్తి ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కలను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కాలనీకి చెందిన ఓ వ్యక్తి బంతిపూల మొక్కలతో పాటు ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు నిర్ధారణ చేసుకొని అటవీశాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం ఇంటిపై దాడి చేసి మొక్కలను పట్టుకున్నారు. సుమారు 23 మొక్కలు సాగు చేసినట్లు సమాచారం.

ఇరిగేషన్ అధికారుల విచారణ

కథలాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలూరు, బొమ్మెన వాగులు ఆక్రమణకు గురవుతన్నాయని కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

వీర్నపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం భూక్యాతండా పరిధిలోని రాశిగుట్టతండాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన వంతెన అభివృద్ధి పనుల శిలాఫలకం ధ్వంసంపై పీఆర్ ఏఈ శ్రీనివాస్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ యువకుడు అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపగా శిలాఫలకం ధ్వంసమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు.

అసెంబ్లీలో మన నేతలు

మిడ్ మానేరులో సీప్లేన్ ఏర్పాటు చేయాలి

● శాసనసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రానికి అత్యంత సమీపంలో ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో సీ ప్లేన్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాడు శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రానికి దూర ప్రాంతాల నుంచి ప్రతినిత్యం భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారని, వేములవాడకు కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో సీ ప్లేన్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా మరింత అభివృద్ధి చేయవచ్చని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నుంచి శ్రీశైలంకు సీ ప్లేన్ సౌకర్యం ఏర్పాటు చేశారని, అదే తరహాలో మిడ్ మానేరు ప్రాజెక్టులో గానీ, లోయర్ మానేరు ప్రాజెక్టులో గానీ సీప్లేన్ సౌకర్యాన్ని కల్పించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని ఆది శ్రీనివాస్ కోరారు. సీ ప్లేన్‌తో పాటు బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను కూడా పరిశీలించాలని తద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నాంపల్లిగుట్ట పైకి రోప్ వే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి వదిలేసిందని, రోప్ వే ఏర్పాటుకు గల అవకాశాలను సైతం ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. మిడ్ మానేరులో సీప్లేను, బోటింగ్, నాంపల్లి గుట్ట పైకి రోప్ వే ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పర్యాటక రంగం మరింత ఊపందుకుంటుందని ఆయన అన్నారు.

రాజన్న భక్తులకు అదనంగా బస్సులు కేటాయించాలి

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తుంటారని, భక్తుల సౌకర్యార్థం నూతనంగా డిపోకు అదనపు బస్సులు కేటాయించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అసెంబ్లీలో టీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. కోరుట్ల నుంచి వేములవాడకు హైదారాబాద్ నుంచి వచ్చే చివరి బస్సుల సమయాన్ని పెంచాలని సూచించారు. రద్దీకి అనుగునంగా బస్సుల సంఖ్య పెంచుతామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ధర్మపురిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి

● అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గానికి భారీ ఎత్తున నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని, రైతులు 90 శాతం మంది ఆధారపడి ఉన్న ప్రాంతమని ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆయన ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఆవశ్యకత గురించి ఆయన ప్రస్తావించారు. గతంలో ఈ ప్రాంత ప్రజల కోరిక గురించి ప్రభుత్వంలో ఉన్న పెద్దల దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో పలుమార్లు ప్రజలు ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయగా ప్రతి ప్రక్షంలో ఉన్న తాము కూడా ధర్నాలో పాల్గొన్నామని ఆయన తెలిపారు. ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు అన్నివిధాల అవకాశం ఉందని తెలిపారు. సంబంధిత మంత్రి వెంటనే ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీ స్పీకర్ ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు.





● కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన ఒక యువకుడి మొబైల్‌ఫోన్‌కు గుజరాత్‌కు చెందిన అహ్మద్‌ఖాన్ అనే సైబర్ నేరగాడు మెస్సేజ్, ఫైగోల్డ్ పేరిట యూట్యూబ్ లింక్‌లను పంపించాడు. బంగారం, ఎక్స్‌ఆర్‌పీ సంస్థలో పెట్టుబడులు పెడితే త్వరగా రెట్టింపు అవుతుందని నమ్మబలికాడు. వీటిని నమ్మిన ఆ యువకుడు ఆ లింక్‌తో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అతని బ్యాంక్ ఖాతా నుంచి పలు మార్లు 33.63 లక్షల రూపాయలు సైబర్ నేరస్థుడు పంపించిన ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనుమానం వచ్చి ఆ ఖాతా లను పరిశాలించగా ఫేక్ ఖాతాలుగా నిర్ధరణ అయి కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు విచారణ చేపట్టేసరికే ఆ ఖాతాల్లోని డబ్బులు విత్‌డ్రా అయ్యాయి.

ఆలస్యం.. అమృతం.. విషం

● సైబర్ మోసాలపై సత్వరమే స్పందించాలి

● గోల్డెన్ టైంలో ఫిర్యాదు చేస్తే రికవరీకి అవకాశం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరం జరిగిన తరువాత సాధ్యమైనంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఇలా ఫిర్యాదు చేస్తే ఇతర ఖాతాలకు బదిలీ అయిన డబ్బును హోల్డ్‌లో పెడతారు. విచారణ అనంతరం బాధితులకు డబ్బులు అందజేస్తారు. నేరం జరిగిన తర్వాత స్పందించే సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారు. గతంలో గంటలోపు ఉండే సమయం ప్రస్తుతం నిమిషాల్లోకి మారింది. ఆ గోల్డెన్ అవర్ కాస్త గోల్డెన్ టైంగా మారింది. సైబర్ నేరం జరిగిందని గుర్తించిన వెంటనే స్పందించి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

సైబర్ మోసాలపై ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీ నంబర్

సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి 1930 టోల్‌ఫ్రీం నంబరు ఉంది. ఈ కేసులను ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐసీసీసీ) పర్యవేక్షిస్తుంటుంది. దేశంలో ఏ రాష్ట్రం, ఏ ప్రాంతం నుంచి సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కి కాల్ వచ్చినా అక్కడి అధికారులు స్పందించి వివరాలను నమోదు చేసుకుంటారు. 24 గంటలు ఈ టోల్‌ఫ్రీ నంబరు పని చేస్తుంది. ఒక సైబర్ మోసం జరిగినట్లు ఫిర్యాదు రాగానే ఆ బాధితుడు ఇచ్చిన ఖాతా నంబరు ఆధారంగా వెంటనే ఆ ఖాతాను ఫ్రీజ్ చేస్తారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కోర్టులో సమాచారం అందించి, కోర్టు ఆదేశాలతో నేరస్థుడి ఖాతా నుంచి ఆ డబ్బులను బాధితుడి ఖాతాకు జమ చేస్తారు. ఐసీసీసీకి దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంక్‌లు అనుసంధానమై ఉంటాయి. ఆయా బ్యాంక్‌ల నోడల్ ఆఫీసర్లు నిత్యం ఈ సైబర్ కేసులను పరిశీలిస్తూ, వారి బ్యాంక్‌లకు సంబంధించిన కేసు నమోదైతే వెంటనే ఆ ఖాతాలను హోల్డ్‌లో పెడుతారు. బాధితులు మోసం జరిగిన వెంటనే సాధ్యమైనంత వరకు తక్కువ సమయంలో సైబర్ క్రైం టోల్‌ఫ్రీం 1930కు సమాచారం అందించాలి. బాధితుడి పేరు, ఇతర వివరాలతోపాటు తన బ్యాంక్ ఖాతా నంబరు, తేదీ, సమయం, డబ్బులు ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన ఐడీ, స్క్రీన్‌షాట్, సైబర్ నేరగాళ్లు పంపించిన లింక్ లేదా మెస్సేజ్ వంటి వివరాలను అందించాలి.



కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు ఠాణా

● కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడి టెలిగ్రాం అకౌంట్‌కి క్రిప్టో కరెన్సీకి సంబంధించిన ఒక ప్రొఫైల్ వచ్చింది. దీనిని ఓపెన్ చేయగా డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే తక్కువ సమయంలో రెట్టింపుకావటంతోపాటు మరి కొన్ని బహుమతులు గెలుచుకునే అవకాశముందని రాజస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాడు నమ్మబలికాడు. దీంతో ఆ యువకుడు 1.6 లక్షల రూపాయలు ఫోన్‌పే ద్వారా నేరస్థుడి ఖాతాకు పంపిం చాడు. ఆ తరువాత ఫోన్ స్విఛాఫ్ రావటంతో మోసపోయానని బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. అప్పటికే నిందితుడు తన ఖాతాలోని డబ్బులను విత్‌డ్రా చేశాడు.





● ఇటీవల ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక ఉద్యోగి సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కి లక్ష రూపాయలు గుర్తుతెలియని ఖాతాకు పంపించాడు. మోసానికి గురయ్యానని తెలుసుకున్న వెంటనే నిమిషాల వ్యవధిలో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి డబ్బులు జమ అయిన ఖాతాను హోల్డ్‌లో పెట్టి బాధితుడికి న్యాయం చేశారు.

ఏపీకే లింక్‌లు ఓపెన్ చేయొద్దు..

వరాల నర్సింహారెడ్డి, కరీంనగర్ సైబర్‌క్రైం డీఎస్పీ



మొబైల్‌ఫోన్‌కు వచ్చే గుర్తుతెలియని ఏపీకే లింక్‌లను తెరవొద్దు. క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దు. సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లను మాత్ర మే ఉపయోగించాలి. కొత్త నంబర్ల నుంచి వచ్చే వీడియో కాల్స్, వాట్సప్ కాల్స్ రిసీవ్ చేసుకోవద్దు. మోసాలబారిన పడకముందే సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు అందించాలి. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం వల్ల నేరస్థుల ఖాతాలను ఫ్రీజ్ చేసి, పోయిన డబ్బులు తిరిగి రాబట్టేందుకు అవకాశం ఉంటుంది.

20న జాబ్ మేళా

గణేశ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలు కల్పనకు ఈనెల 20న కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్ దగ్గర ప్రభుత్వ ఈ-ఆధార్ సేవ కేంద్రం పై అంతస్థులో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ సంస్థలో 20ఫార్మసిస్ట్, 30సేల్స్ అసోసియేట్, 50 జూనియర్ అసిస్టెంట్, 15 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. సేల్స్ ఫార్మసిస్ట్ పోస్టులకు డిప్లొమా/డిగ్రీ ఇన్ ఫార్మసీ, జూనియర్ అసిస్టెంట్, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ అసిస్టెంట్లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 20న ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయానికి వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9392310323, 7207659969, 9908230384 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరి డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

జమ్మికుంటలో ఆరగంట ఆలస్యంగా డిగ్రీ పరీక్ష

జమ్మికుంట, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జరుగుతున్న ఐదవ సెమిస్టర్ ఇంగ్లీష్ పరీక్ష మంగళవారం ఆరగంట ఆలస్యంగా జరిగింది. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా, సరిగ్గా ప్రశ్నాపత్రం ఇచ్చే సమయానికి కరెంట్ పోయింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. 8.50గంటలకు ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం ప్రింట్ తీసి విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంది. కరెంట్ పోవడంతో అధ్యాపకులు హైరానా పడ్డారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ హుటాహుటిన జనరేటర్ తెప్పించి ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రాలు ప్రింట్ తీసి విద్యార్థులకు ఇచ్చారు. అప్పటికి ఆరగంట గడిచిపోయింది. యూనివర్సిటీకి సమాచారం అందించడంతో అదనంగా మరో ఆరగంట సమయం కేటాయించడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

నర్సరీలపై సమావేశం

సైదాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నర్సరీలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణ నర్సరీలపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 169క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. అదేవిధంగా 290మంది రైతులు 4510క్వింటాళ్ల పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి మద్ధతు ధర ప్రకారం విక్రయించారు.

మాల కులస్థులపై దుష్ప్రచారం మానుకోవాలి

ఇల్లందకుంట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాల కులస్థులపై మాదిగలు చేసే దుష్ప్రచారాన్ని మానుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మాలలు ఎన్నడు వ్యతిరేకం కాదని, వర్గీకరణతో పాటు క్రిమిలేయర్ వ్యవస్థను తీసుకువస్తారని తెలిపారు. క్రిమిలేయర్ వ్యవస్థ ద్వారా రాబోయేరోజుల్లో ముందు తరాలకు అన్యాయం జరుగుతుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, కనుమల్ల రామకృష్ణ, బోగం చిరంజీవి ఉన్నారు.

కోడెల పంపిణీకి అనుమతి తప్పనిసరి

● ప్రతి రోజూ కోడెల వివరాలు రిపోర్ట్ చేయాలి ● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ● వేములవాడ ఆలయ గోశాల నిర్వహణపై సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న దేవాలయం గోశాలకు సంబంధించిన కోడెల పంపిణీకి కలెక్టర్ అనుమతి తప్పనిసరని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో వేములవాడ ఆలయ గోశాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ గోవులను పంపిణీ చేసేందుకు వీలులేదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1975 కోడెలు, ఆవులను గోశాల నుంచి పంపిణీ చేశామని, వీటిలో మొదటి దశలో 1278 కోడెలు, 75 ఆవులు, రెండో దశలో 389 కోడెలు, 45 ఆవులు, మూడో దశలో 188 కొడెలు పంపిణీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మొదటి, రెండు దశలకు మాత్రమే కలెక్టర్ అనుమతి తీసుకున్నారని, మూడో దశ మాత్రం అనుమతి లేకుండా ఎలా పంపిణీ చేశారని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రశ్నించారు. మూడో దశ పంపిణీకి గల కారణాలపై సమగ్ర నివేదిక అందించాలని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే శుక్రవారం నాటికి జిల్లాలో పంపిణీ చేసిన 1975 కోడెలు, ఆవుల స్థితి గతులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంపిణీ చేసే సమయంలో వాటికి ట్యాగ్ ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం పోలీస్ సిబ్బంది విచారించి ఎంపిక చేసే వరకు ఏ లబ్ధిదారుడికీ గోశాల నుంచి కోడెలు, ఆవులను ఇతర జిల్లాలకు పంపిణీ చేసేందుకు వీలు లేదన్నారు. ప్రతీ రోజు వేములవాడలోని 2 గోశాలలు, ఆలయ ఆవరణలో కోడెలు, ఆవుల వివరాలు తెలియ జేయాలన్నారు. లబ్ధిదారుల జాబితాపై కలెక్టర్ సంతకం లేనంత వరకు అది ఫైనల్ కాదని స్పష్టం చేశారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతీ వారం సమీక్ష సమావేశం ఉంటుందని, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు జరగాలని అన్నారు. ఎక్కడా అవకతవకలు ఉండడానికి వీలులేదని, ఆలయానికి సంబంధించిన ప్రతీ అంశం తన దృష్టికి రావాలని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, వేములవాడ ఆలయ ఇన్‌చార్జి ఈవో రాజేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీపీఆర్వో శ్రీధర్, వేములవాడ తహసీల్దార్ మహేష్ ఉన్నారు.

కబేళాలకు కోడెల తరలింపుపై భక్తుల ఆవేదన

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి



వేములవాడలో శాంతిహోమంలో పాల్గొన్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న కోడెలను కబేళాలకు తరలించడంపై భక్తులు ఆవేదన చెందుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. రాజన్న కోడెలను గీసుకొండలో కబేళాలకు తరించడంపై వేములవాడ పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి శాంతిహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కాదని, కాసుల సురేఖ అని మహాశివుడి శాపానికి గురికాక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా మంత్రి కొండా సురేఖ అనుచరులు రాజరాజేశ్వరస్వామి కోడెలను కబేళాలకు తరలిస్తున్నారన్నారు. కోడెల ఆత్మశాంతి కోసం శాస్త్రీయత ప్రకారం శాంతి హోమం నిర్వహించామన్నారు. నిజకోడెను స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నట్లు వివరించారు. ఏ పార్టీ ముఖ్యమంత్రి అయినా ఆలయాల విశిష్టతను కాపాడేందుకు కృషి చేస్తారన్నారు. రాజన్నకు కోడె చెల్లించుకుంటే పరమేశ్వరునికి చెందుతుందని, భక్తులు విశ్వసించేవారని, ఇప్పుడు కోడె చెల్లించుకుంటే మంత్రి షెడ్డులోకి పోతున్నాయని పలువురు మాట్లాడుకుంటున్నారని అన్నారు. ఓరుగల్లు పేరును కాపాడాల్సిన మంత్రి అనుచరుల చేత కోడెలను కబేళాలకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. కాశీకి పోయినా, గంగాలో మునిగినా ఈ పాపం పోదన్నారు. కాసుల కోసం కోడెలను అమ్మిన కసాయి సురేఖ అని ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి తప్పినందుకే ములుగులో భూమి కంపించిందని, చెట్లు నేలమట్టమయ్యాయని అన్నారు. రాజన్న కోడెలను కబేళాలకు తరలించిన ఘటనపై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు నిమ్మశెట్టి విజయ్ తదితరులు ఉన్నారు.

అంకాపూర్, ములుకనూర్‌లకు దీటుగా లక్ష్మీపూర్

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

జగిత్యాలరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆదర్శగ్రామాలుగా ఉన్న అంకాపూర్, ములుకనూర్లకు దీటుగా లక్ష్మీపూర్ నిలుస్తుందని, రైతులు సంఘంగా ఏర్పడి ముందుకు సాగుతున్న తీరు ప్రశంసనీయమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఏడీఏ అశోక్‌కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. లక్ష్మీపూర్ రైతులు తాము పండించిన ఉత్పత్తులను ఆహార ఉత్పత్తులుగా మార్చేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ వైపు దృష్టిసారించడమేకాకుండా, సేంద్రియ వ్యవసాయంవైపు మళ్లాలని సూచించారు. ఆహార ఉత్పత్తులను బయటిదేశాలకు ఎగుమతి చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ సహకారసంఘం చైర్మన్ పన్నాల తిరుపతిరెడ్డి, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ప్రతినిధి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం వద్ద రైతులతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

బస్సు సౌకర్యం లేక మోడల్ స్కూల్ విద్యార్థుల ఇబ్బందులు

కొడిమ్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు ఏడాది కాలంగా రాకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలువురు విద్యార్థులు గ్రామాల నుంచి ఆటో, వ్యాన్లలో పాఠశాలకు వస్తున్నారు. దీని కోసం ఒక్కొక్కరు నెలకు 1,000 రూపాయల నుంచి 1,500 రూపాయల వరకు చెల్లిస్తున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. మండలంలోని నల్లగొండ, తిప్పయ్యపల్లి, చెప్యాల, పూడూర్, నాచుపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు కొడిమ్యాల బస్టాండ్‌లో దిగి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌కు నడిచి రావటం ఇబ్బందిగా తయారైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మండల ప్రత్యేక అధికారిని కలిసి ఆర్టీసీ బస్సును మోడల్ స్కూల్ వరకు నడిపించాలని విద్యార్థులు కోరారు. గతంలో వేములవాడ నుంచి మోడల్ స్కూల్ వరకు నడిచిన ఆర్టీసీ బస్సు ఏడాదిగా నిలిచిపోవటంతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు రాకపోవటంతో గత సంవత్సరం 393 మంది విద్యార్థులు ఉన్న సంఖ్య ప్రస్తుత్తం 295 మందికి తగ్గింది.

● పాఠశాల మైదానంలో బండరాళ్లు..

మోడల్ స్కూల్ మైదానంలో పెద్ద రాళ్లు ఉండటంతో క్రీడలకు ఆటంకంగా మారాయి. అంతే కాకుండా పాఠశాల మైదానంపై తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండటం వాలీ బాల్ ఆడుతున్న సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. మైదానంలోని రాళ్లను తొలగించి, విద్యుత్ వైర్లను మార్చాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంబందిత అధికారులు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మోడల్ స్కూల్ వరకు ఆర్టీ బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బ్యాగులతో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు



బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు

మోడల్ స్కూల్ వరకు బస్సును నడుపాలి

- లావణ్య, ప్రిన్సిపాల్



కొడిమ్యాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సును అధికారులు నడిపించాలి. సుమారు రెండు కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు నడిచి రాలేకపోవటంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఏడాది కాలంగా ఆర్టీసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఎవరూ పట్టించుకోవటం లేదు.

ఇంటర్వ్యూ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్టు

- మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు



మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని, మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ఎవరు రౌడీయిజం చేసినా, సెటిల్మెంట్‌లు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి: డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎస్పీ: మెట్‌పల్లి, కోరుట్ల సర్కిల్ పరిధిలో క్రిమినల్ యాక్టివిటీస్ ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. బెదిరింపులకు పాల్పడినా, రౌడీయిజం, సెటిల్‌మెంట్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరు రౌడీయిజం, సెటిల్ మెంట్‌లు చేసినా పీడీ యాక్ట్ ఓపెన్ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలపై ప్రజలకు ఏవిధంగా అవగాహన కల్పిస్తున్నారు?

డీఎస్పీ: డివిజన్ పరిధిలో సైబర్ నేరాలకు సంబంధించి గ్రామాల్లో ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది అవగహన కల్పిస్తున్నారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తులు గాని, పోలీస్‌లు, బ్యాంక్ అధికారులు అంటూ కాల్ చేస్తే నమ్మవద్దని, ఎవరికీ ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, ఓటీపీలు వంటివి చెప్పవద్దని ప్రజలకు అవగహన కల్పిస్తున్నాం. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1090 కాల్ చేసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి?

డీఎస్పీ: అటువంటిది ఏం లేదు సామాన్య ప్రజలు ప్రతీ ఒక్కరు స్టేషన్‌కు వెళ్లి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకోవచ్చు. ప్రతి ఠాణాలో సమస్యలను పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చు. ఠాణాలో డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. పోలీస్‌స్టేషన్‌లో ఎవరు డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

రాజ్యాంగాన్ని కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు - అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన



జగిత్యాలలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అరాచకాలు, అణిచివేత నుంచి లగచర్ల రైతులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తూ మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మాట్లాడారు. పేద దళిత, గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేసు కుంటున్న భూములను బలవంతంగా లాక్కోని వారిని రోడ్డున పడేసే కుట్ర రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తరలించడం అన్యామమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, వివిధ గ్రామాల బీఆర్ఎస్, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. లగచర్ల రైతులను అరాచక పాలన నుంచి కాపాడాలని కోరుతూ పట్టణంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, ఏఎంసీ మాజీ ఛైర్మెన్ శీలం ప్రియాంక ప్రవీణ్, అర్బన్, రూరల్ మండలాధ్యక్షులు తుమ్మ గంగాధర్, ఆనంద రావు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు బర్కం మల్లేష్, ఎలిగేటి అనిల్, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్ రావు, మహేష్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు స్పందనసాగర్ రావు, కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, కన్నాక మహేందర్, మాజీ ఎంపీపీ సంధ్యారాణిసురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మల్యాలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, పోతారం సింగిల్‌విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, మాజీసర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, గడ్డం రాజేశం, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు

సారంగాపూర్: బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, మాజీ సర్పంచ్ బల్మూరి నారాయణరావు, మండల అధ్యక్షుడు తేలు రాజు, మండల ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండల కేంద్రంలోని ఇందిరానగర్ చౌరస్తాలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయ కులు కొల్ముల రమణ, మెరుగు రాజేశం, బీర్‌పూర్ గ్రామశాఖ అధ్యక్షుడు రామచంద్రం, సత్యనారాయణ, రాములు తదితరులు ఉన్నారు.

కొడిమ్యాల: లగచర్ల రైతులకు ప్రభుత్వం బేడీలు వేసినందుకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, తిర్మలాపూర్ సింగిల్ విండో ఛైర్మన్ రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్, కొప్పుల సురేష్, రంగు తిరుపతి, మూగల సత్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని సూరారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్, నాయకుడు గాజుల మల్లేశం, తదితరులు వినతిపత్రం అందజేశారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వ చర్యను నిరసించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు మాదారపు కరుణాకర్‌రావు, రాజశేఖర్‌గౌడ్, లక్ష్మణ్, స్వామి, ఆనంద్, మంత్రి వేణు, రాజమల్లు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోస్కుల జలంధర్, మండల కో ఆర్డినేటర్ బోయపోతు గంగాధర్, గందె వెంకట మాధవరావు, నక్క శంకర్, కాంపెల్లి హన్మాండ్లు, ఆవుల సత్యం, కిషన్, అవారి చందు, రమేష్, తిరుపతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్రాంతికి కొత్త రేషన్‌కార్డులు

5వ పేజీ తరువాయి..

రేషన్ కావాల్సిన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు, రేషన్ తీసుకోని వారికి స్మార్ట్ హెల్త్ కార్డుల రూపంలో మంజూరు చేస్తారు. ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఇందుకు సంబంధించి నియమ నిబంధనలు విడుదల కాగానే.. తిరిగి దరఖాస్తుల స్వీకరణకు మరోసారి అవకాశం ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా కొత్త కార్డులతో పాటు సన్నరకం బియ్యం ఇస్తామని ప్రకటించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● రేషన్ కార్డే ప్రామాణికం..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందాలంటే లబ్ధిదారులకు రేషన్ కార్డు తప్పనిసరిగా మరింది. నిన్నటి వరకు సాగిన రైతు రుణమాఫీ పథకం మొదలుకుం టే...రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, గృహ జ్యోతి, మహిళలకు ప్రతినెలా రూ. 2500, యువ వికాసం, గృహలక్ష్మి తదితర పథకాల వరకు అన్నింటికీ రేషన్ కార్డు ప్రామాణికంగా మారింది. దీంతో ప్రభుత్వ ప్రకటన వెలువడటమే తరువాయి దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారు. రేషన్ కార్డుల జారీకి గతంలో గ్రామీణ, అర్బన్ ప్రాంతాలుగా సంవత్సర ఆదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డులు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలో రూ. 1.50 లక్షలు, అర్బన్ రూ. 2 లక్షల్లోపు ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకున్నారు. భూ విస్తీర్ణం తరి భూమి అయితే 3.5 ఎకరాలు, మెట్ట అయితే 7.5 ఎకరాలలోపు ఉండాలనే నిబంధనలు అమలు చేశారు. ఇప్పుడవే నిబంధనలు అమలు చేస్తారా....కొత్త మార్గదర్శకాలు నిర్ధేశిస్తారా అన్న అంశాలపై కూడా త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా తమకు కొత్త రేషన్ కార్డులు అందుతాయన్న ఆశతో అర్హులైన నిరుపేద కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

సారంగాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు చేపట్టిన ఇందిరమ్మ సర్వే కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగలవారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో నిర్వహించిన సర్వేను ఎంపీడీవో సీహెచ్ గంగాదర్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాల స్థితిగతులు, కుటుంబ సభ్యుల వివరాలు, సొంత ఇంటి స్థలం, దానికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట కార్యదర్శి నరేష్, సిబ్బంది ఉన్నారు.

కొడిమ్యాల (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఏడో రోజు మంగళవారం కొనసాగింది. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో సర్వేయర్లు ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. మంగళవారం నాటికి మండలంలో 1,550 ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించినట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు.

వాహనాల తనిఖీ

కథలాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేట క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు. విధిగా నిర్ణీత పత్రాలు ఉంచుకుని ప్రయాణం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల నవీన్, రాజు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జగిత్యాలరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మాజీపేట గ్రామంలో గల గుట్టపైన గల రామాలయ నిర్మాణానికి ఎంపీ నిధుల ద్వారా మంజూరైన నూతన సీసీ రోడ్డు పనులకు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద గంగారాం, దివాకర్, రమేష్, దామోదర్, లక్ష్మణ్, మహేష్, సుధాకర్, రాజన్న, గంగాధర్, రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయాన్ని వీడీసీకి అప్పగించాలి

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో ప్రసిద్ధి చెందిన ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపకుండా యథావిధిగా గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) ఆధీనంలో ఉండాలని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. మంగళవారం దేవాదాయ శాఖ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి విధుల్లో భాగంగా భక్తులకు దర్శన టికెట్లు ఇస్తుండగా అక్కడి చేరుకున్న గ్రామస్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆలయాన్ని దేవాదాయ శాఖలోకి విలీనం చేయవద్దని నిరసన తెలిపారు. దీంతో ఆలయం పరిసరాల్లో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఏళ్ల నుంచి ఆలయానికి సేవలు చేస్తున్నామన్నారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి సీఐ తన సిబ్బందితో అక్కడి చేరుకున్నారు. ఎండోమెంట్ యాక్ట్ కింద ఆలయాన్ని దేవాదాయశాఖలోకి విలీనం చేశారని ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి పోలీసులకు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు సీఐ తెలిపి నిరసన నిలిపి వేయాలని కోరారు. సీఐ అధికారులతో మాట్లాడి వారం రోజుల సమయం ఇచ్చారని, అప్పటి వరకు ఆలయం వద్ద ఎలాంటి నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టవద్దని సూచించారు.

డ్రమ్‌సీడర్ విధానంలో రైతులకు సమయం ఆదా

జగిత్యాలరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డ్రమ్‌సీడర్ విధానంలో వరిసాగుతో రైతులకు సమయం ఆదా అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి రామచంద్రం అన్నారు. జగిత్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామంలోని దూడ గంగాధర్‌కు చెందిన రైతు పొలంలో నేరుగా డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు విత్తే కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమానికి జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతూ విత్తన మోతాదు 15 నుంచి 18 కిలోలు ఆదా అవుతుందన్నారు. పంటలు ఏడు నుంచి పది రోజుల ముందు కోతకు వస్తాయని, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం విత్తవచ్చునని తెలిపారు. కూలీల కొరతను అధిగమించి, కూలీలపై ఆధారపడకుండా ఉంటుందని పేర్కోన్నారు. ఈ పద్ధతి వానాకాలం కంటే యాసంగికి చాలా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వినీల, ఏఈవో నాగరాజు, రైతులు సతీష్, దామోదర్‌రావు, భీమరావు, రాజేందర్‌రావు, గంగన్న, అక్తర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



డ్రమ్ సీడర్ విధానంలో వరిసాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

జగిత్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఉత్తమమైన సేవలతోనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పర్యవేక్షకులుగా పదోన్నతిపై నిర్మల్‌కు వెళ్తున్న సంతోష్‌కుమార్‌ను, బదిలీపై వెళ్లిన సీనియర్ అసిస్టెంట్ శ్రావణిని జిల్లా అధికారి మనోహర్, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేశ్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు భరోసా అందించిన కేసీఆర్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

కోరుట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 43 శాతం పెన్షన్ సవరణ చేసి భరోసా అదించిందని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు అన్నారు. మంగళవారం జాతీయ పెన్షనర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ అధ్యక్షుడు పద్మ శివానందం, పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించి అభినందించారు. ఈసందర్బంగా విద్యాసాగర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చి పెన్షనర్ల డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి లావణ్య, పెన్షనర్లు లక్ష్మీనారాయణ, సైఫోద్దీన్, రాజయ్య, చిలుక గంగారాం పాల్గొన్నారు.

సింగిల్‌విండోల అభివృద్ధే ధ్యేయం

పెగడపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక సహకార సంఘాలను బహుళార్ధ సేవా సహకార సంఘాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మంగళవారం డీసీఓ మనోజ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎరువుల గోదాంను సందర్శించి ఎరువుల నిల్వలను, పీఏసీఎస్ నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం సంఘ రికార్డులను , రోజువారీ లావాదేవీలను, గోల్డ్ లోన్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘం పరిదిలోని రైతులకు దీర్ఘకాలిక రుణాలు 16 లక్షల 50 వేలు, బంగారు ఆభరణ రుణాలు రూ.4 లక్షలు విలువ గల చెక్కులను అందజేశారు. సంఘం నందు రూ. 1,40,000 ఫిక్సిడ్ డిపాజిట్ చేసిన సభ్యురాలుకు డిపాజిట్ బాండ్‌ను మనోజ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే 12 మంది సభ్యులకు కామన్ సర్వీసెస్ సెంటర్ ఎల్‌ఐసీ ప్రీమియం రశీదులు అందజేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిష్టార్ మల్లేశం, సంఘం సీఈవో రౌతు మధూకర్, సిబ్బంది రాజు, దామోదర్ ఉన్నారు.

దొంగ మల్లన్నను దర్శించుకున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్

భీమారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగోజీపేటలో గత మూడు రోజులుగా జరుగుతున్న దొంగ మల్లన్న జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా చివరి రోజైన మంగళవారం కరీంనగర్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నమనేని అజిత్ రావు, రాజేందర్, కంచె శంకర్, పల్లి అర్జున్, పిట్టల లక్ష్మీరాజం, పింజారి శ్రీనివాస్, పింజారి శివ కుమార్, దువాస నారాయణ, కడతల వెంకటేష్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శుల నియామకం



చంద్రశేఖర్



వినోద్

రాయికల్ / జగిత్యాల అర్బన్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శులుగా రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, జగిత్యాల పట్టణానికి చెందిన తాటిపాముల వినోద్ కుమార్ నియామకమయ్యారు. ఉపాధ్యక్షుడిగా కొక్కుల రాజేష్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే తమ నియామకానికి సహకరించిన టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లకటి రాజ్ కుమార్, రాష్ట్ర గౌరవ సలహాదారుడు బోగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామైక్య సంఘం సమావేశం

ధర్మపురి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మెనాల గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సరస్వతి గ్రామైక్య సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ బచావో, బేటీ పడావో పథకం గురించి, ఆడ పిల్లల చదువు ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి, మొబైల్, సోషల్ మీడియా దుష్ప్రభావం గురించి వివరించారు. బాల్య వివాహాల నిషేధిత చట్టం, మహిళ రక్షణ చట్టాల గురించి వివరించారు. టోల్ ఫ్రీ నంబర్లు 100, 112, 181, 14567, 1098 సఖీ సేవలు, అంగన్‌వాడీ సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్స్, సిటిజన్స్ గురించి తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, హెచ్‌ఎం వేణుమాధవ్, జిల్లా మహిళా సాధికారిత సభ్యులు గౌతమి, స్వప్న, హేమశ్రీ, సఖి కేంద్రం అనురాధ, భాగ్యలక్ష్మి, గ్రామైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న సర్వశిక్ష ఉద్యోగులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం నెరవేర్చాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె దీక్ష మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. ఈ దీక్షలు బీఆర్ఎస్ నాయకులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మార్పీఎస్, పీఆర్టీయూ నాయకులు సంఘీభావం ప్రకటించి, తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రభుత్వం అధికారంలోకి వస్తే క్రమబద్ధీకరిస్తామని మాటిచ్చారని, ఏడాది గడిచినా తర్వాత కూడా ఈ సమగ్ర ఉద్యోగులు ఎందుకు రోడ్కెక్కాల్సి వచ్చిందో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సమాధానం ఇవ్వాలన్నారు. ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వసంత విజ్ఞప్తి చేశారు. అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మెలో భాగంగా పెట్టిన అంశాలు డిమాండ్లు కాదని అవి వారి ప్రాథమిక అవసరాలని ప్రభుత్వం గుర్తించాలన్నారు. అనంతరం పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు రొట్టె శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ లో ఏళ్లుగా సేవలందిస్తున్న 20వేల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు వారి డిమాండ్లను పరిష్కరించడంతో పాటు క్రబద్ధీకరించాలని ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో మునిపట్ల రాజేందర్, బ్రహ్మాండభేరి నరేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు సతీష్, రాజు, కిషన్, సురేందర్, గంగారాం పాల్గొన్నారు.

● బతుకమ్మ ఆడుతూ నిరసన

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎనిమిదో రోజు దీక్షలో భాగంగా మహిళా ఉద్యోగినులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలియజేశారు. ప్రభుత్వం సత్వరమే స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని, అంత వరకు బేసిక్ పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంక్షేమ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జీవితకాల వెన్నెముక వ్యాధులతో బాధ పడుతున్న 16 మంది దివ్యాంగులకు ప్రత్యేక క్యాంప్ నిర్వహించినట్లు జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన ఈ క్యాంపులో అత్యధిక మద్దతు అవసరం ఉన్న 16 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి, వారికి కావాల్సిన వైద్య సేవలను అందించారు. అత్యధిక అవసరాల కోసం ప్రభుత్వం తరపున సహాయం అందించడానికి బెంచ్ మార్క్ వికలాంగత్వం కలిగిన దివ్యాంగులకు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ్ కుమార్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ వారికి అండగా ఉంటుందని సంక్షేమ శాఖ అధికారి నరేష్ తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, సూపరింటెండెంట్ రాములు, ఎఫ్ఆర్‌వో కొండయ్య, సీనియర్ సహాయకులు చంద్రమోహన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా పడిపూజ

రాయికల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం రాత్రి మహా పడిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప ఆలయంలో ఉదయం ఆరు గంటలకు గణపతి హోమం, 9 గంటలకు కుంకుమ పూజ, 10 గంటలకు లక్ష పుష్పార్చన, 12 గంటలకు స్వాములకు, భక్తులకు బిక్ష, సాయంత్రం ఏడు గంటల నుంచి మహా పడిపూజ, తొమ్మిది గంటలకు స్వాములకు, భక్తులకు అల్పాహారం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పంచాయతీ సిబ్బంది ముందస్తు అరెస్టు



రాయికల్ పోలీస్‌స్టేషన్ వద్ద పంచాయతీ కార్మికులు

రాయికల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పంచాయతీ సిబ్బందిని పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు వెళ్లకుండా సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేసిఅ అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. రాయికల్ మండలంలోని కారోబార్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

కొడిమ్యాల: మండలంలో అరెస్ట్ అయిన వారిలో మురళీమొహన్, రమేష్, నరేష్, అశోక్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని చౌలమద్ది, వెల్లుల్ల గ్రామంలో విధులు నిర్వహిస్తున్న కారోబార్ వాసాల రాములు, గణేష్ ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేసి మెట్‌పల్లి స్టేషన్‌కు తరలించారు.

కోరుట్ల రూరల్: మండలంలో కారోబార్ సంఘ నాయకుడు వినయ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయలలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను పోలీస్‌లు ముందస్తుగా అరెస్ట్ చేశారు.

బీర్‌పూర్: మండలంలో కారోబార్లు కనుక వికాస్, మంద రమేష్, పుదారి గంగాధర్, గ్రామ పంచాయతీ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

గొల్లపల్లి: మండలంలో పంచాయతీ కార్మికులు జంగిలి ఎల్లయ్య, సాతల్ల మహేష్, రాజయ్య, తడగొండ సురేష్, జేరిపోతుల అంజయ్య, గంగ స్వామి, లచ్చయ్య జమున, లక్ష్మి, పోచమ్మ తదితరులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

అరెస్ట్ అక్రమం..

జగిత్యాల అర్బన్(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి హైదరాబాద్ సమావేశానికి వెళ్తున్న తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగులు మరియు కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ఒక ప్రకటనలో ఖండించారు. పంచాయతీ కార్మికుల జేఏసీ 17న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునివ్వగా పోలీసు అధికారులు మహాధర్నాకు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి ఇందిరాపార్క్ వద్దకు చేరుకున్న కార్మికులను, నాయకులను అరెస్టు చేసి నిర్బంధించారని ఆరోపించారు. అక్రమంగా అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకం

మల్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకమని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి దేవప్రసాద్ అన్నారు. మల్యాలలోని రైతువేదిక వద్ద నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులతో మాట్లాడారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని ముత్యంపేటకు చెందిన మ్యాక లక్ష్మణ్ మరి కొంత మంది రైతులు 30ఎకరాలలో చేపట్టి ఆయిల్ పామ్ సాగు మొక్కలకు సంబంధించి డీడీలను అందించారు. అంతకు ముందు రైతులకు యాసంగి పంటల సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏవో చంద్రదీపక్, ఏఈవోలు మంజుల, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనినివాస్ పాల్గొన్నారు

కబడ్డీ పోటీల్లో ప్రతిభ

ధర్మపురి, డిసెంబరు, 17 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ముస్కాన్, సిందూజ, వర్షిత జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మంగళవారం ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు బహుమతి సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్ జ్యోతి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షిప్త సమాచారం

రాయికల్: రాయికల్ పట్టణంలోని జగిత్యాల రోడ్డులోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని కాలనీలో మురికి కాలువ, తాగునీటి పైపులైన్ నిర్మించాలని 3వ వార్డు కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘంలో రిటైర్డ్ ఉద్యోగుల సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రిటైర్డ్ ఉద్యోగుల సంస్థ అధ్యక్షుడు కొరిడె విశ్వనాథశర్మ, కార్యదర్శి ఇందారపు బండయ్య, సంగనభట్ల చిన్నరామకిష్టయ్య, పానుగంటి దత్తాత్రి, అంబరీషాచార్య కలిసి ఎస్‌బీఐ మేనేజర్ నరేష్, పెండ్యాల విశ్వనాథం, పుప్పాల మురళి, గొల్లపల్లి గుండయ్యను సన్మానించారు.

భీమారం: భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అసెంబ్లీలో కోరారు.